క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



సుధాకర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్, రాజు

డాబాగార్డెన్స్: గత కొంత కాలంగా అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీవీఎంసీ 36వ వార్డు వైఎస్సార్ సీపీ కార్యకర్త కుందేటి సుధాకర్‌కు ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు శుక్రవారం పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రాజమండ్రి సదస్సును విజయవంతం చేయండి

మహారాణిపేట: ఈనెల 30న రాజమండ్రిలో ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ కోరారు. ఉద్యోగుల సమస్యల సాధనకు రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు నాయకత్వంలో జరుగుతున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి పీఎం జవహర్ తెలిపారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, ఈ సదస్సులో పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని జవహర్ తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో కె.శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు ఈ మేరకు స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న 756వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. చారిత్రక నేపథ్యం గల స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. జనవరి 30వ తేదీ నాటికి ఉద్యమం మొదలై రెండేళ్లుగా కొనసాగడం గొప్ప విషయమన్నారు. కె.మణి, కె.కుమారి, బి.భారతి, సుజాత, ఆర్.విమల, కె.వేణు, బి.రమణి, ఎల్.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐకార్ వ్యవస్థాపక దినోత్సవం

దొండపర్తి : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(ఐకార్) విశాఖ సెంటర్ 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఐకార్ విశాఖ రీజనల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ చార్లెస్ జీవా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల హార్వెస్టింగ్, పెంపకంలో ఐకార్–సిఫ్ట్ విశేష సేవలందించిందని తెలిపారు. సిఫ్ట్‌కు మూడు సార్లు సర్దార్ పటేల్ ఉత్తమ ఐకార్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ శాస్త్రవేత్తలను సన్మానించారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన సుమారు 200 మంది విద్యార్థులకు కేంద్రంలోని పరిశోధన, కార్యకలాపాలను వివరించారు.

ధైన్యం నుంచి.. దర్జా వైపు

- నాబార్డ్, నేస్తం చొరవతో వెలుగుల వైపు గ్రామీణ హస్త కళాకారుల జీవితాలు
- నిలదొక్కుకుంటున్నామని హర్షాతిరేకాలు

గ్రామీణ హస్త కళాకారుల కుటుంబాల్లో వెలుగులు విరబూస్తున్నాయి. వారి ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతోంది. వారు పడిన శ్రమకు తగిన ఫలితం దక్కుతోంది. ఇన్నాళ్లు వారి ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదనే చెప్పాలి. గ్రామీణ హస్త కళాకారుల తలరాత మార్చేందుకు నాబార్డ్, నేస్తం సంస్థలు ఇతోధిక చొరవ తీసుకుంటున్నాయి. ఫలితంగా వారు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. తాము తయారు చేసిన ఉత్పత్తులను వారే స్వయంగా పట్టణాల్లో విక్రయించుకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారు.

డాబాగార్డెన్స్: నాబార్డ్ అధికారులు, నేస్తం సంస్థ ప్రతినిధులు రాష్ట్రంలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో పలు రకాల హస్త కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకు రావడంలో సఫలీకృతులయ్యారు. పట్టణాల్లో వారికి ఉచితంగా స్టాల్స్ పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో హస్త కళాకారులు తమ ఉత్పత్తులను ఆ స్టాళ్ల ద్వారా విక్రయిస్తున్నారు. ఆర్థికంగా గతంలో కంటే బలోపేతం అవుతున్నారు. విశాఖలో ఓ ప్రముఖ వస్త్ర దుకాణం (షాపింగ్‌మాల్)లో స్టాల్ ఇన్ మాల్ పేరిట ఏర్పాటు చేసిన స్టాళ్లలో హస్త కళాకారుల ఉత్పత్తులను నగరవాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.



ఇటీవల స్టాల్ ఇన్ మాల్ పేరిట ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న నాబార్డ్ ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ (ఫైల్)

మంచి ఆదరణ లభిస్తోంది..



కొద్ది రోజుల్లోనే రూ.3 లక్షల 50 వేల వరకు వ్యాపారం చేశాను. అత్యంత నాణ్యమైన చీరలు తయారు చేసి నగర వాసులకు అందిస్తున్నాం. విశాఖ ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. కొనుగోళ్లు చక్కగా జరుగుతున్నాయి.

సుమతీదేవి, హస్తకళాకారిణి, నెల్లూరు జిల్లా

ఆర్థికంగా బలపడుతున్నాం..



చక్కటి అమ్మకాల వల్ల ఆర్థికంగా బలపడుతున్నాం. నాబార్డ్ ఏర్పాటు చేసిన స్టాల్‌లో గార్మెంట్స్, టాప్స్, మహిళలు ధరించే వివిధ రకాల ఫ్యాన్సీ ఆభరణాలు విక్రయిస్తున్నాను. ఇప్పటి వరకు రూ.లక్షా 26 వేల వ్యాపారం సాగింది. నాబార్డ్ అధికారుల కృషి ఫలితంగా మాకు చక్కటి తోడ్పాటు లభిస్తోంది.

విజయలక్ష్మి, ఫ్యాన్సీ, ఆభరణాల విక్రయదారు, కర్నూలు

గిటుబాటు ధర లభిస్తోంది..



ఏటికొప్పాక బొమ్మలు విక్రయిస్తున్నాను. స్టాల్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.లక్షా 24 వేలకు పైగా వ్యాపారం జరిగింది. లాభసాటిగా ఉంది. ఇన్నాళ్లు మేము తయారు చేసిన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు వచ్చేవి కావు. నాబార్డ్ అధికారుల సహాయ సహకారంతో వ్యాపారం చాలా బాగా నడుస్తోంది.

సోమేశ్వరరావు, హస్తకళాకారుడు, విశాఖపట్నం

కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరుకుతోంది



మేము పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలం లభిస్తోంది. ఈ స్టాల్‌లో వెదురు, జూట్ అల్లికలతో చేసిన ఉత్పత్తులు విక్రయిస్తున్నాము. కొనుగోలుదారులు చాలా ఇష్టపడుతున్నారు. ఇప్పటి వరకు రూ.లక్షా 16 వేలకు పైగా విక్రయాలు చేశాం. రోజురోజుకీ విక్రయాలు పెరుగుతున్నాయి.

అప్పమ్మ, వెదురు, జూట్ ఉత్పత్తిదారు, శ్రీకాకుళం

ప్రజాదర్బార్‌కు చక్కటి స్పందన

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో 34వ వార్డు మనోరమా థియేటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, వెంకటేష్, సాగర్, రామరాజు, వాసు, ధనరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో కూడా ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డ్ ప్రెసిడెంట్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల శ్రీహరిరెడ్డి, కడియం ప్రసాద్, ధనాల రాంబాబు, సాగర్, రామరాజు, వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న వాసుపల్లి

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

శ్యామలాంబ ఆలయ నిర్వాహకుడిపై ఫిర్యాదులు

- గుడిని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని భక్తుల విజ్ఞప్తి
- బహిరంగ విచారణ చేపట్టిన ఏసీ శిరీష



విచారణ చేపడుతున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని శ్యామలాంబ అమ్మవారి ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని కొంతమంది భక్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష శనివారం సాయంత్రం ఆలయం వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఆలయాన్ని నిర్వహిస్తున్న ఏలూరి మురళి అనే వ్యక్తి పాత కమిటీని, ఆలయ వ్యవస్థాపకులను, పూజారిని దగ్గరకు రానీయకుండా, కమిటీ లేకుండా ఒక్కడే గుడి నిర్వహిస్తున్నాడని భక్తులు ఫిర్యాదు చేశారు. భక్తులు హుండీలో వేస్తున్న డబ్బులను ఏరోజు కారోజే ఇంటికి పట్టుకెళ్లి పోతున్నాడని, బంగారం, వెండి కానుకలు, అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలకు లెక్క లేదని, అమ్మవారికి కట్టే చీర రూ.10 వేల పైనే ఉండాలని, బిల్లుతో సైతం చీర ఇవ్వాలని షరతులు పెడుతున్నాడని ఆరోపించారు. అనంతరం చీరలు మళ్లీ ఆయా షాపులకే విక్రయిస్తున్నాడని అధికారి ముందు ఏకరవుపెట్టారు. అమ్మవారికి చీర చూపించాలంటే రూ.516, నీరు పొయ్యాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. హుండీ ఆదాయానికి, అన్నదానానికి వచ్చే విరాళాలకు లెక్క లేదని, అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని, గుడి ముందు రోడ్‌ను ఆక్రమించి షెడ్, స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆలయాన్ని మురళీ చేతుల నుంచి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుని, కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఐదుగురితో నూతన కమిటీ..

ఏసీ శిరీష ఇరుపక్షాల నుంచి అభిప్రాయాలను, రాతపూర్వకంగా స్టేట్‌మెంట్స్ తీసుకున్నారు. సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని మురళీని ప్రశ్నించారు. అవి ఉంటే ఎవరు ఏం చేస్తున్నారు తెలుస్తుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పాటించడం లేదన్నారు. ఆలయంలోని రెండు హుండీలను సీజ్ చేయించారు. స్థానికులు, భక్తులు, కమిటీ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఐదుగురితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. శీల సన్యాసిరావు, జక్కంపూడి రమాదేవి, దేవేందర్, జగన్, మురళి కమిటీ సభ్యులుగా నియమించి, ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా నడుచుకోవాలని వారికి ఏసీ శిరీష సూచించారు.

సినీ యుగళ గీతాల కార్యక్రమం రేపు

దాబాగార్డెన్స్: గీత్ సంగీత్ సినీ సంగీత సంస్థ బ్యానర్‌పై ఈ నెల 30న విశాఖ పౌరగ్రంథాలయంలో సినీ యుగళ గీతాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు 15 మంది గాయనీమణుల గళ సహకారంతో సుమారు 160 పాటలను ఆలపించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ రికార్డ్స్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. విశాఖ నగరంలో గల సంస్థల అధినేతలు, కళాకారులు, సినీ సంగీత అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ రికార్డు ప్రయత్నంలో విజయం సాధించే దిశగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ ప్రతినిధి రమణమూర్తి, కార్యక్రమం కన్వీనర్ కోరుకొండ రంగారావు, కొణతాల రాజు, ఎంవీఆర్ నాగేశ్వరరావు, గీత తదితరులు పాల్గొన్నారు.

దివంగత నేత వైఎస్సార్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

అల్లిపురం: జీవీఎంసీ 30వ వార్డు తాడివీధిలో శనివారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, విల్లూరి భాస్కరరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, పీతల వాసు, కర్రి నీలకంఠం, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందచేత

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సీఎం కప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్లకు స్పోర్ట్స్ కిట్లను శుక్రవారం అందచేశారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా 14 క్రీడల్లో మే ఒకటో తేదీ నుంచి ఐదురోజుల పాటు తిరుపతి వేదికగా పోటీలు జరగనున్నాయి. అథ్లెటిక్స్‌తో సహా పలు క్రీడల్లో జట్లకు శాప్ మెంబర్ జొన్నాడ శ్రీనివాసరావు, సెట్విస్ సీఈవో సీహెచ్ సుబ్బిరెడ్డి, వీడీఎస్ఏ చీఫ్ కోచ్ సూర్యారావు పాల్గొని జట్లకు కిట్స్ పంపిణీ చేశారు.

ఘనంగా మౌంట్ డియోస్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్

దొండపర్తి : మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ కాన్వొకేషన్, కల్చరల్ ఫెస్ట్–2023 పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు అకడమిక్ కోఆర్డినేటర్ వరలక్ష్మి నేతృత్వం వహించగా ముఖ్య అతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. ముందుగా అధ్యాపకుల ఆధ్వర్యంలో బృందం ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనియర్ సెకండరీ విద్యార్థిని శర్వాణి నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై వారి ప్రతిభను ప్రదర్శించారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్య వందన సమర్పణ చేశారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

ఉపాధ్యాయులకు సామాజిక తనిఖీలపై శిక్షణ

అల్లిపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరు, మూల్యాంకనం, సామాజిక తనిఖీలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. చెంగలరావుపేట ప్రాథమిక పాఠశాలలో విశాఖ అర్బన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఎస్‌వీఎస్ నారాయణ, ఎస్.సత్యారావు, ఎస్ఎస్ఏఏఎస్‌వో గీత, ఖలిసా బేగం పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా విషయాలపై సామాజిక తనిఖీ ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు, గవర్నమెంట్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

సమస్య పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే వాసుపల్లితో పాటు కలెక్టర్‌ను కలిసిన వెంకటేశ్వరమెట్ట వాసులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట సర్వే నంబరు 1450 సమస్యపై, ఎల్లమ్మతోట సమస్యపై స్పందించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలెక్టర్ మల్లికార్జుననను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి బొడ్డేటి అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్ట వాసులతో కలిసి శుక్రవారం కలెక్టర్‌ను కలిసారు. వందల ఏళ్ల నుంచి వెంకటేశ్వరమెట్టపై నివాసం ఉంటున్న తమను దేవదాయ శాఖ అధికారులు వేధిస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. తాము నిర్మించి, నిర్వహించుకుంటున్న వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని 1971లో దేవదాయ శాఖకు అప్పగించామని తెలిపారు. పెళ్లిళ్లు, చదువులు, అనారోగ్యానికి అవసరమై ఇళ్లు అమ్ముకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ దీనిపై సమగ్ర నివేదిక తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వెంకటేశ్వరమెట్ట వాసులు సూరిశెట్టి చిట్టినాయుడు, భీశెట్టి శ్రీను, బొడ్డేటి అచ్యుత్ ప్రసాద్ తదితరులు అభినందించారు. అవసరమైతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వెంకటేశ్వరమెట్ట నివాసులు

భక్తిశ్రద్ధలతో సాయి సత్య వ్రతం



పంచామృతాభిషేక సేవలో సాయినాథుడు



సామూహిక సాయి సత్య వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణా నగర్‌లోని షిర్డీసాయి ధ్యాన మందిర 14వ వార్షిక మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయినాథుడికి పంచామృతాభిషేకాలు, విభూదితో అభిషేకం, మండప ఆవాహన పూజలు, షిర్డీసాయి మూలమంత్ర జప హోమం, పూర్ణాహుతి జరిపారు. అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ, కాగడా హారతి ఇచ్చారు. సాయంత్రం సామూహిక సాయి సత్య వ్రతం నిర్వహించారు. 300 మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. పూజా సామగ్రిని ఆలయ కమిటీ ఉచితంగా అందజేసింది. శనివారం ఉదయం 1008 లడ్డూలతో సాయిబాబాకు అభిషేకం, మధ్యాహ్నం ఆలయం వద్ద 3 వేల మందికి మహా అన్నదానం, సాయంత్రం పురవీధుల్లో పల్లకీ సేవ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి కిరణ్‌కుమార్ తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులు తోటపల్లి శ్రీనివాస్, ప్రగఢ జగన్నాథరావు, కార్యదర్శి పోలిపల్లి సూర్యారావు, కోశాధికారి తోటపల్లి వెంకట సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

30న కన్యకాపరమేశ్వరి జయంతి

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 30న అమ్మవారి జయంతి నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వేకువజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, స్వర్ణ వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర కథా గానామృతం, వాసవీ మూలమంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం 12 గంటలలకు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనుననట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సుగ్గు శివకుమార్, పూసర్ల సురేష్‌కుమార్, సీపీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి

పడకేసిన పారిశుధ్యం

- వ్యాధుల భయంతో జోన్–4 ప్రజలు
- పారిశుధ్య సిబ్బందికి అనధికారికంగా కార్యాలయాల్లో విధులు



దుర్గంధం వెదజల్లుతున్న చెత్త

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో పారిశుధ్యం పడకేసింది. పబ్లిక్ హెల్త్ విభాగంలో పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలో లేకపోవడమే దీనికి ప్రధాన కాణంగా తెలుస్తోంది. దీని వలన పూర్ణామార్కెట్, రామకృష్ణరైతుబజార్, రెల్లివీధిచేపల మార్కెట్, అల్లిపురం బజార్‌తో పాటు పాతనగరంలోని మురికివాడల్లో అపారిశుధ్యం తాండవిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రానున్నది వ్యాధుల సీజన్ కావడంతో అపారిశుధ్యం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ కార్యాలయంలో సుమారు 30 మంది..

పబ్లిక్‌హెల్త్ విభాగంలో పారిశుధ్య పనులు చేయాల్సిన సుమారు 30 మందికి పైగా సిబ్బంది జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. వాస్తవంగా వీరందరూ వార్డులోని వీధుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంది. కానీ రికమెండేషన్ల కారణంగా నీడ పట్టున జీవీఎంసీ సౌకర్యం సెంటర్‌లోనో, జోనల్ కమిషనర్ కార్యాలయంలోనో, రెవెన్యూ కార్యాలయల్లోనో ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సకాలంలో నిర్దేశించిన పనులు పూర్తి కావాలని.. అవసరమైతే కాంట్రాక్టర్ ద్వారా సిబ్బందిని నియమించుకోమని జీవీఎంసీ కమిషనర్ చెబుతున్నా కింది స్థాయి అధికారులు మాత్రం ఆ వైపుగా ఆలోచన చేయడం లేదని సమాచారం. సిబ్బందిని కార్యాలయాల నుంచి పంపించక, అవసరం మేర అదనపు సిబ్బందిని నియమించుకోక ఉదాశీనంగా వ్యవహరించడం వల్ల పారిశుధ్యం పడకేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రజారోగ్యానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా

అల్లిపురం: జీవీఎంసీ జోన్–4 పరిధి అల్లిపురంలో శుక్రవారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట తదితర ప్రాంతాల్లో మంచినీటికి స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్మన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు విషయం తెలియజేయటంతో ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ వాటర్ ట్యాంకర్‌ను పంపించడంతో స్థానికులు నీటిని నింపుకున్నారు.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు